# ఆత్మజ్ఞానం

శ్రీ ఆర్. యస్. సుదర్శనం

ఒక వ్యాపారవిషయమై రెండురోజుల పనిమీద మా తండ్రిగారు నన్నావూరు పంపించారు. ప్రకాశం అక్కడ కాలేజీలో లెక్చరరుగా కుదిరి రెండేళ్లయింది. సరాసరి వాడి దగ్గరకే వెళ్లితే బాగుంటుందనిపించింది. ఏడాదిక్రితం వాడివివాహం జరిగినప్పుడు నేను వెళ్ళలేకపోయాను. అప్పటినుంచీ నా మీద కోపంతో ఉత్తరాలు వ్రాయటం మానివేశాడు. ఇప్పుడైనా వెళ్లి స్వయంగా క్షమాపణ చెప్పుకుంటే బాగుంటుందని నిశ్చయించాను.

నేను వస్తున్నానని వ్రాసిన వుత్తరానికి తిరుగుటపాలో వెంటనే పెద్ద ప్రత్యుత్తరం వచ్చింది. స్నేహం అంటే ఏమిటో, స్నేహాన్ని ఎలా కాపాడుకోవాలో, అనుభవించి ఆనందించాలో, వాడి ధ్యేయాలు ధోరణిలో ప్రకాశం పెద్ద ఉపన్యాసం దంచాడు. రెండు రోజులు కాదు. కనీసం పది రోజులైనా, వాళ్లింట్లో వుండేటట్లు ప్రయాణమై రమ్మన్నాడు.

ప్రకాశం, నేను కాలేజిచదువు అయిదేళ్లూ కలిసి చదివాము. చదువులో వాడు నాకన్న తెలివైనవాడు. బాగా పరిశ్రమ చేసేవాడు, అన్న విషయం యూనివర్శిటీ ఫలితాల్ని బట్టైనా అంగీకరించవలసిందే! ఆనర్సులో వాడికి సెకండ్ క్లాసు, నాకు థర్డ్ క్లాసు వచ్చాయి....డిగ్రీ తీసుకున్న ఏడాదికే ప్రకాశానికి లెక్చరరు ఉద్యోగం దొరికింది. నేనింకా 'సరైన' ఉద్యోగంకోసం తంటాలు పడుతున్నాను...ఈ మధ్య కాలంలో మా నాన్నగారు తమ వ్యాపారవిషయాలు కొన్ని నాకు అప్పచెబుతూ, 'తర్ఫీదు'యిస్తున్నారు—

సెలవు పెట్టి స్టేషనుకు వచ్చాడు ప్రకాశం. వాడు ఏ విషయాన్ని గురించి శ్రద్ధ తీసుకున్నా ఆద్యంతాలు దాన్ని సంపూర్ణంగా, 'ఆద్యాప్రాయం'గా, నిర్వహించిగాని లేక సాధించిగాని, వదిలి పెట్టడు—ఇది వాడి ప్రత్యేకత. మాటలూ, చేతలూ ఒకటిగా వుండాలంటాడు—అన్ని విషయాల్లోనూ! ఇప్పుడు స్నేహం విషయమే వుందనుకోండి: వాడు వుత్తరంలో వ్రాసిన ప్రతి వాక్యమూ ప్రత్యక్షంగా, ఆచరణలో పెట్టే, స్నేహమంటే ఎటువంటిదో యిక నాకు గట్టి పాఠం నేర్పి కాని వదలనన్నమాట! నాకు వాని యింటి అడ్రసు తెలుసుకదా, ప్రత్యేకంగా నాకోసం సెలవు పెట్టి స్టేషనుకు రావటం దండగే; సర్వెంటును పంపితే చాలు--కానీ అల్లాఅంటే ఒప్పుకోడువాడు. "స్నేహంకంటె విలువైన దేమిటోయ్!" అంటాడు.

ప్రకాశం అందమైనవాడు. ఒడ్డూ పొడుగు, పెద్దనుదురు, చక్కని కళ్లు, నొక్కులజుట్టు, మంచిశరీరచ్ఛాయ, ఇవి అతని స్వతస్సిద్ధ లక్షణాలు; ఆకర్షణీయంగా నవ్వటం, చూపులు విసరటం, అలవాటు చేసుకొని సాధించిన గుణాలు. ఆ రహస్యం నాకే బాగా తెలుసు!...అద్దం ముందు కూర్చుని, అదేపనిగా రోజూ ఒక్క అరగంట, కోణదృష్టుల్లో చూసుకుంటూ, ముఖకవళికల్ని మారుస్తూ, ప్రసన్నత, ఆనందం, వాంఛ, సానుభూతి, చిఱుకోపం, విషాదం మొదలైనభావాల్ని ఎంత అందంగా, సూటిగా ప్రకటించవచ్చునో ప్రయత్నించి సాధించేవాడు. ఇక నడక, నిల్చోవటం లాంటివి చెప్పనక్కరేదు......ఆ రోజుల్లో యివన్నీ మొదట ప్రయోగించటంకూడా నామీదే; నా విమర్శ పూర్తిఅయిన తర్వాతనే, వాటిని లోకంమీద—ముఖ్యంగా యువతీలోకంమీద ప్రయోగించేవాడు. "నీకేంరోయ్, ఆడపిల్లలంతా నీవెంటే పడుతున్నారు!" అని కాస్త హేళనగా అన్నా, స్నేహితులు అది నిజమనే లోపల కొంతవరకు నమ్మేవాళ్లు కూడా, బయటికి ఒప్పుకోకపోయినా!...కాని ప్రకాశాన్ని మించిన భయస్తుడు, ఆడవాళ్ళ ఎదుట సిగ్గుపడేవాడు. మరొక్కటా వుండేదన్న రహస్యం నాకు తెలుసు...ప్రకాశం భావగీతాలు (పద్యాలు కాదు) వ్రాసేవాడు; అది ఒక సాధనే! తర్వాత ఆ గీతల్ని భావస్ఫోరకంగా చదివేవాడు...వానిది మంచిగొంతుక సంగీతం రాకపోయినా...మొత్తంమీద వాడు కొర

దిగిన 'పర్సనాలిటీ ట్రెయిట్స్' అన్నీ సాధించాడు.. వాడి సాధన మొదట్లో నవ్వుతాలుగా వుండేది. కాని చివరికి వాడిపట్టుదల, సీరియస్ నెస్ చూచి అందరూ ఊరుకున్నారు...భర్తృహరి చెప్పిన మూడువిధాలైన మానవుల్లో ఉత్తమశ్రేణికి చెంది, అందులోకూడా ప్రథముడుగా వుంటాడు ప్రకాశం!

ఇలు చక్కగావుంది. డ్రాయింగ్ రూమూ, ఫర్నిచర్, కరెన్సీ ప్రకాశానికి మంచి "టేస్టు" వుందనే కాదు, బాగా డబ్బుకూడా వుందని స్పష్టం చేస్తున్నాయి. విద్యార్థిగా వుండేటప్పుడు అనవసరపు దరాలకు డబ్బు పాడుచేసేవాడు కాదు ప్రకాశం— అంటే. స్నేహితులు పదిమందికీ తరచు పార్టీలివ్వటం, ప్రెజెంటేషన్లివ్వటం, ఎక్స్ కర్షన్సుకి సొంతఖర్చు మీద వాళ్ళని తీసుకువెళ్ళటం లాంటివి—ఏది అవసరమో దానికి లెక్క వేసి, కొంత లేకుండా ఖర్చుపెట్టేవాడు ...ఇప్పుడు వాని యిలుచూస్తే అందులోని వస్తుసముదాయంకూడా ఆ గుణాన్నే జ్ఞాపకం తెచ్చింది.

ఇల్లు చేరుకున్న కాస్సేపటికే తన భార్య 'సరోజ'నీ, ఆమె చెల్లెలు 'రేణుక'నీ—ఇంట్లోవున్న ఆ ఇద్దరు ఆడవాళ్ళనీ తీసుకొచ్చి పరిచయం చేశాడు. వాళ్ళు నమస్కారాలు పెట్టి తిప్పుకున్నతర్వాత, పాత విషయాలు, క్రొత్త సంగతులు ఎడతెరిపి లేకుండా మాట్లాడేశాడు ప్రకాశం......

"ఏమోయ్ నా పెళ్ళికి రాకుండా చాలడిసప్పాయింట్ చేశావ్! పోనీ, ఇప్పుడు చెప్పు నీ అభిప్రాయం! నాకు తగ్గ భార్యనే పెళ్ళాడానంటావా?"

కాస్త ఆలోచించాను; చాల సున్నితమైన విషయం మరి:

"నీ 'పర్సనాలిటీ ట్రెయిట్స్'కి తగ్గ 'ట్రెయిట్స్' ఆమెకున్నాయో, లేవో నాకు తెలీదుగాని, నా అభిప్రాయం: ఆమె తనకంటె మహాఅందగాణ్ణి మాత్రం పెళ్ళిచేసుకోలేదు!" అన్నాను.

"చచ్చాం పో! నీ డొంకతిరుగుడు ఇంకా మానలేదన్నమాట...సూటిప్రశ్నకు సూటిసమాధానం చెప్పి ఏడవటం ఎప్పుడూ లేదు!...ఇంతకూ నా మారేజి నీ విమర్శకు ఆగుతుందా, ఆగదా? చెప్పు."

"ఓ, సెంట్ పర్సెంట్ మార్కులు వచ్చాయి."

భోజనమైన తర్వాత నా పనిమీద నేను బయలు దేరాను. "నువ్వొస్తావనీ, నీతో సరదాగా మాట్లాడాలని సెలవుపెట్టి ఇంట్లో కూర్చుంటే, మళ్లీ సాయంత్రం దాకా రానంటున్నావ్!' అని అసంతృప్తిని వెలిబుచ్చాడు ప్రకాశం.

"దానికేం? ఇవాళ సాయంత్రంనించీ రేప్రొద్దుట మళ్లీ యీ వేళదాకా నీ స్వాధీనములోనే వుంటానే!"

"రేపుకూడా వుండేమిటి యీగొడవ?"

"ఇవాళ లూస్తువునే రేపు ఖాళీయే."

సాయంత్రం అయిదింటికి, నేను తిరిగి వచ్చేటప్పటికి, ప్రకాశం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. నా గౌరవార్థం ఒక చిన్న సైజు టీపార్టీ సిద్ధంచేశాడు - అంటే మరేం లేదు; టీ సెట్టు వగయిరాలతో నేనూ, ప్రకాశం, సరోజా, రేణుకా సోఫాల్లో కూర్చున్నాం. పనికుఱ్ఱాడు అన్నీ అందించాడు. గృహిణి హోదాలో సరోజ టీ కలిపి కప్పుల్లో పోస్తున్నది.

టీ త్రాగటం పూర్తి కావచ్చింది. అంతసేపూ ప్రకాశంఒక్కడే మాట్లాడుతున్నాడు ఆడవాళ్ళిద్దరూ ఏదోకొత్తగా, సిగ్గుపడుతూ మా యెదుట కూర్చున్నారని గ్రహించాను. సరోజ తన కర్తవ్యంలో పూర్తిగా మునిగిపోయింది...రేణుక వాళ్లక్కయ్య వైపు తిప్పిన కళ్ళు మరల్చనే లేదు.

"నువ్వు...ఎప్పుడు చేసుకుంటావోయ్, పెళ్ళి? మమ్మల్నీ పిలవొద్దు...ఎలాగూ రాము!" అన్నాడు ప్రకాశం.

"నీ యిష్టం!"

"నా యిష్టమేమిటి నీ పెళ్ళికి..." సరోజ, రేణుక నవ్వారు..."చెప్పు,ఎప్పుడు చేసుకుంటావో!" అన్నాడు ప్రకాశం. నాకు కోపం వచ్చింది. వాళ్ళూ నేనూ కొత్తగా ఫీలవుతూవుంటే, వాళ్లముందర తన తెలివి ప్రదర్శిస్తూ గొప్పకోసం నన్ను కవ్వించటం దేనికి వీడు!

"బహుశా చేసుకోను!" అసహారి తొక్కాను.

ఆ జవాబుకి అక్కాచెల్లెళ్ళిద్దరూ నావైపు కుతూహలంగా చూశారు...మొదటిసారిగా...

"ఎందుకని?...ఈమధ్య మారినట్లున్నావే!"

"ఆc... పెళ్ళిచేసుకొని, ఒక అమాయకురాల్ని కష్టపెట్టటం నాచేతకాదు, అందుకని..."

రేణుక చిరునవ్వు, సరోజ భర్తవైపు చూచిన చూపు, గమనించాను.

"కష్టపెట్టటం లేదులేవోయ్! ... సుఖపెట్టు... అయితే నిన్ను పెళ్ళిచేసుకునే అమ్మాయిది చాల అదృష్టమేనన్నమాట!" అన్నాడు ప్రకాశం.

"ఏమీ కాదు!...నాకు కవిత్వం రాదు...థర్డ్ క్లాసు డిగ్రీ...ఉద్యోగం లేదు...ఇక ఎందులో వుందంటావు అదృష్టం?"

"కవిత్వమంటే గుర్తొచ్చింది...మొన్న నా గీతాలసంపుటి పబ్లిష్ అయింది...నువ్వు చూళ్ళేదు కదూ!...నీమీద కోపంతో పంపలేదులే...ఇదుగో!" ప్రకాశం షెల్ఫునుంచి ఒకప్రతి తెచ్చియిచ్చాడు.

దాన్ని ఇటు అటు త్రిప్పిచూచి, "బావుంది" అని తిరిగి యివ్వబోయాను.

"ఏం బావుందంటావ్? ఆ క్రొత్తగేయాలు చూడకుండానే!"

సరోజ, రేణుక లోపలికి వెళ్ళిపోయారు.

అరగంట పైగా క్రొత్తగీతాల్ని స్వయంగా పాడి వినిపించాడు ప్రకాశం. అదికాగానే—"ఏం లేవోయ్, సరోజతో నువ్వసలు మాట్లాడనే లేదే!— పిలుస్తానుండు..." అన్నాడు.

"వద్దులే...ఆమె సిగ్గుపడుతున్నట్లుంది. అయినా ఎందుకలా యిబ్బంది పెడతావ్?...మాట్లాడేందుకు సంగతులేమైనా వుండొద్దూ?" అన్నాను.

"నాన్సెన్స్. సిగ్గేమిటోయ్?" అంటూ ప్రకాశం లోపలికి వెళ్ళొచ్చాడు. కొన్ని నిముషాల తర్వాత వాడి భార్య పళ్ళెంలో ద్రాక్షగుత్తులు తెచ్చింది.

ప్రకాశాన్ని తృప్తిపరచడానికని ఆమెతో.

"మళ్ళీ యివెందుకండీ...యిందాకనే టీ తాగాం కదా!" అన్నాను.

సరోజ సమాధానంగా చిరునవ్వు నవ్వుతూ, పళ్ళెం టీపాయ్‌మీద పెట్టింది. తర్వాత భర్తవైపు పాక్క పారి చూచి నిల్చుంది.

"గొంతు ఎండిపోయింది, నాకోసం తెప్పించావా లేవోయ్" అన్నాడు ప్రకాశం.

"ఏమండీ వీడితో వేగటం కష్టంగా వుంది కదూ!... మొత్తానికి వీడు చాలా అదృష్టవంతుడు... కాలేజిలో చదివినన్నాళ్ళూ వీడి బాధ్యత నేను వహించాను, యిప్పుడు మీరు!" అన్నాను సరోజతో.

ప్రకాశం ద్రాక్షపళ్ళు తింటూ వున్నాడు.

"మిమ్మల్నిగురించి చాలసార్లు చెప్పారు... పెళ్ళికి మీరు రాలేదని ఎన్నోసార్లు అనుకున్నారు" అన్నదామె.

"ఏం చేసేది...వీలేకపోయింది..." అంటూ నా యిబ్బందులేవో వివరించాను కొంతసేపు.

తర్వాత ఆమె "కొంచెం పనుంది...వెళ్తానండి" అంటూ లోపలికి వెళ్ళింది...

"పర్సనాలిటీ ట్రెయిట్స్ అన్నావే, సరోజను గురించి నీ అభిప్రాయమేమిటి?"

నాక్కోపం వచ్చింది. వీడింత ఫూల్‌లాగ మాట్లాడుతున్నాడేమిటని?...మళ్ళీ ఏ అరమరికా లేని స్నేహభావంవల్ల అట్లా అడుగుతున్నాడేమో అని పించింది......

"పర్సనాలిటీ ట్రెయిట్స్ సంగతి నాకు తెలీదు...అది అర్థంలేని ప్రశ్న...నాకామె చెల్లెలైతే ఎంతో గర్వించేవాణ్ణి...నీకు భార్యఅయింది కాబట్టి నువ్వింకా గర్వించాలి......పువ్వుల్లో పెట్టి పూజ చెయ్యాలికూడా!" అన్నాను నొక్కుతూ.

రాత్రి పడుకున్న తర్వాత అనుకున్నాను: ఏమిటి చెప్మా వీడి మనస్తత్వం? అని. సాయంత్రం జరిగినదాన్లో ఒకవిధంగా చూస్తే నాకు వీడి స్వోత్కర్ష తప్ప మరేం కనిపించటంలేదు...నాకు పరిచయంలేని ఆడవాళ్ళ ఎదుట వీడు నన్ను కవ్వించి, తన తెలివిని, ఆధిక్యాన్ని వ్యక్తంచేసుకోవటం ఒకటి; తర్వాత భార్యని యిబ్బందిపెట్టి బలవంతంగా నాయెదుట పరీక్షకోసం నిలబెట్టటం మరొకటి—పెళ్లివిషయంలో కూడా వీడి అదృష్టాన్ని, ఆధిక్యాన్ని నేను గుర్తించాలని తాపత్రయమన్నమాట—ఇది స్వోత్కర్ష కాక యింకేమిటి?

కాని యింకోవిధంగా చూస్తే, బహుశా నన్ను కూడా బంధువర్గంలో జమకట్టుకుని తన భార్యకు పరిచయం చేయటానికని, ఆత్మీయంగా, ఆప్యాయంగా చేసిన కలుపుగోలు ప్రయత్నం అని చెప్పవచ్చు .. ... వాడు వ్యక్తంచేసున్న "ఆదర్శప్రాయ"మైన స్నేహభావాన్ని నేను వ్యక్తంచేయలేక పోతున్నానేమో! అది నాలోని లోపమే కాబోలు!.. ఏమైనా, విద్యార్థిదశలో, బ్రహ్మచారులుగా మేం వున్నప్పటి స్నేహం వేరు...పరిస్థితులు మారటంతో స్నేహస్వరూపం మారి తీరుతుంది—అది గుర్తించక పోవటం అసంబద్ధం, అవివేకం! ... ఎట్లా చూచినా

భార్యది ప్రథమపాపం, ఆ తర్వాత స్నేహితుడు! ప్రకాశం దీన్ని తారుమారు చేస్తున్నాడేమిటి?

రెండోరోజు భోజనంసమయంలోను, యిక రాత్రికూడా సరోజ అన్నీ స్వయంగా అమర్చింది... ప్రకాశం ఆదేశం కాబోలు!

పనులన్నీ పూర్తిచేసుకొని ఆ సాయంత్రం నేను యిలు చేరుకునేటప్పటికి ప్రకాశం సినిమాప్రోగ్రాం వేశాడు. సినిమాహాలు వాళ్ళింటికి దగ్గరే—ఓ ఫర్లాంగు దూరం వుంటుంది. నడిచే వెళ్ళాము. బాల్కనీసీట్లు—నా ప్రక్కన ప్రకాశం, తర్వాత సరోజా, రేణుకా కూర్చున్నారు. జలపాతంలా వుండిన ప్రకాశం మాటల ఉరవడి అప్పటికి తగ్గుముఖం పట్టింది — అగ్గలమే కాదు, సాయంత్రంనుంచీ పరధ్యానంగా కూడా కనిపించాడు... నాకు కొంత ఊపిరి తీసుకునే అవకాశం లభించింది.... తర్వాత పిక్చర్ ప్రారంభం కావటంతో అందులో నిమగ్నులమయ్యాం... ఒక గంట గడిచింది. అప్పటికి సుమారు మూడోవంతు పిక్చర్ అయివుంటుంది... ప్రకాశం నా వైపు వంగి "తలనొప్పిగా వుందోయ్" అని మెల్లగా అన్నాడు. వాడదివరకే కుర్చీలో అటుయిటు మెదులుతూ వుండటం నేను గమనించాను... "పోతుందిలే!" అన్నాను. కొన్ని నిముషాల తర్వాత వాడు మళ్ళీ "నేను యింటికి వెళ్తాను, మీరందరూ పిక్చరు చూచి రండి" అన్నాడు నాతో.

నేను మళ్ళీ మాటాడే అంతలో నే అటువైపు తిరిగి సరోజతో కూడా అమాటే చెప్పటం విన్నాను.

"మేమూ వస్తాం...వెళ్ళిపోదాం పదండి" అంటున్నది సరోజ.

"వద్దు...మీరు వుండి చూచి రావాలి" అని ప్రకాశం నావైపు తిరిగాడు.

"అదేమిటోయ్! అందరం వెళ్దాం!" అన్నాను.

"ఏం లేదులే, వెళ్ళివిశ్రాంతిగా పడుకుంటాను... మీరు వుండండి" అంటూ చివాలున లేచి థియేటరునుంచి వెళ్ళిపోయాడు ప్రకాశం.

నాకేం తోచలేదు...ఒకవైపు తెరమీదజరిగే కథని అనుసరిస్తూ వేవున్నా, మనస్సు వెనకాల ఏదో అసంతృప్తిగా, సందిగ్ధంగా వుంది. కొంతసేపైన తర్వాత సరోజతో "ఏమండీ, మనం కూడా వెళ్ళిపోదామా!" అన్నాను.

"వద్దులెండి...ఆయనకు కోపంవస్తుంది" అన్నదామె.

సుమారు అరగంట గడిచినతర్వాత యింటర్వల్ యిచ్చారు. సరోజ తలవంచుకుని భారంగా కూర్చోవటం చూశాను...ఆమె చెంపమీద కన్నీటిచుక్క వెలుతురులో తళుక్కుమన్నది...నా హృదయాన్ని కెలికినట్లయింది...ప్రకాశం యింత మూర్ఖుడేమిటి!... ఈ అమ్మాయి యింత మెత్తనిదేమిటి!

మళ్ళీ పిక్చరు ప్రారంభించారు. "ఏమమ్మా! నాకు కూర్చోవాలని లేదు ... ఇంటికి వెళ్దాం!... ప్రకాశానికి సమాధానం చెప్పటం నావంతు" అంటూ సరోజ సమాధానంకోసం చూడకుండా లేచి యివతలికి వచ్చేశాను. వాళ్ళుకూడా వచ్చారు...దారిలో ఎవరూ మాట్లడలేదు... నేను ముందూ వాళ్ళు వెనకా నడుస్తూంటే నాకు విచిత్రంగాతోచింది ఆసన్నివేశం...ప్రకాశం చేసిందానికి నవ్వాలో ఏడవాలో తెలీలేదు!

పడుకుని ఏదో పత్రిక తిరగేస్తున్నాడు ప్రకాశం...తలనొప్పి తగ్గిందట...కాని భోజనం అక్కర లేదట...సరోజను పిలిచి నాకు వడ్డించమన్నాడు... ఆ రాత్రి పడుకుంటూ "ఇహ ప్రకాశానికి అతిథిగా మాత్రం ఎన్నడూ రాకూడదు!" అనుకున్నాను.

## 2

ఏడెనిమిదిమాసాల తర్వాత నాకు మూడు వందల జీతంమీద ఒక ఇంగ్లీషు కంపెనీలో ఉద్యోగం దొరికింది. తర్వాత కొన్నాళ్ళకే పెళ్ళి సంబంధం చూశానని మా నాన్నగారు వుత్తరం వ్రాశారు. ప్రేమ వివాహాల్లో నాకట్టే నమ్మకం లేదు. ప్రేమ వివాహం కంటె వైవాహికప్రేమ ప్రధానమని నా అభిప్రాయం. అమ్మాయిని చూడటానికని నన్ను తీసుకు వెళ్లారు. తీరాచూసే ఎవరో కాదు, రేణుక!...... ప్రకాశం మరదలు రేణుక!...నా 'రొమాన్సు' ఎనిమిది నెలల క్రితమే ప్రారంభమైందని చెప్పుకోవటానికి అవకాశంకూడా వుందన్నమాట! రేణుకను పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించాను...విచిత్రమేమిటంటే ఇందులో ప్రకాశంజోక్యం ఏమీ లేకపోవటం మేము ఉత్తరాలు వ్రాసుకొని మూడు నెలలు కావస్తుంది. నా ఉద్యోగం సంగతి కూడా వాడికింకా తెలుపలేదు. వెంటనే ఉత్తరం వ్రాశాను.

జవాబు వచ్చింది: "నాకు తెలుసు, నువ్విలాంటిదేదో చేస్తావని! చాలా బాగుంది!!...రేణూకి నువ్వంటే యిష్టం కూడా. క్రిందటిసారి నువ్వు మా యింటికి వచ్చినప్పుడు రేణూ ఇక్కడే ఉందిగదూ—సెప్టెంబరు పరీక్ష వ్రాయటానికి వచ్చి నువ్వు వెళ్ళిన తర్వాత, నువ్వు చాల మంచివాడివనీ, నేను చాల చెడ్డవాణ్ణనీ నాతో పెద్దగా వాదించింది. ఆ విషయం నేను మర్చిపోలేను...సరోజకూడా జ్ఞాపకం చేసుకుని, యిలా పెళ్ళి కుదిరినందుకు సంతోషిస్తున్నది..."

వ్రాసిన మాటలన్నీ బాగున్నాయి కాని, ఆ ముక్క: "సెప్టెంబరు పరీక్ష వ్రాయటానికి వచ్చి" అన్నది ఉత్తరంలో సందర్భానికి అనవసరమేమో అనిపించింది. అందులో ప్రకాశం మళ్ళీ తన ఆధిక్యాన్ని వ్యక్తం చేసుకుంటున్నాడని తోచింది—ఎందుకంటే, రేణుక ఇంటర్మీడియట్ పూర్తిగా ప్యాసవలేదు; సరోజ పాసు తెచ్చుకుంది!

తిరుపతిలో ఒక్కరోజు పెళ్లి... పెళ్ళవగానే రేణుకను తీసుకొని బొంబాయి వెళ్ళిపోయ్యాను. పెళ్లికి వచ్చిన ప్రకాశం తనతో వచ్చి ఒక రోజైనా గడపమని బలవంతం చేశాడు...కాని నిజంగానే నాకు సెలవు చాలలేదు.

బొంబాయి వెళ్ళిన తర్వాత నింపాదిగా శుభాకాంక్షలు తెలుపుతూ వచ్చిన ఉత్తరాలకు జవాబులు వ్రాస్తూ, అందులో వున్న ప్రకాశం లేఖ రేణు చేతికిచ్చాను...చదివి, నవ్వుతూ తిరిగి యిచ్చేసింది రేణు.

"ఏమిటా వాదన...ప్రకాశం మరిచిపోలేదట!" అన్నాను కుతూహలంగా.

"ఆఁ...ఏదో బావని ఉడికించటానికి కాబోలు, నాకు గుర్తులేదు" అన్నది...రేణు అప్పటికి తప్పించుకున్నా అసలు సంగతి కొన్నాళ్ళకు ఆమె ద్వారానే తెలుసుకోగలిగాను:

సరోజ కాలేజిలో ప్రకాశం స్టూడెంటు, ప్రకాశాన్ని మనస్సులో ఆరాధించేది. ప్రకాశం తనని యిష్టపడి పెళ్ళి చేసుకుంటానని పెద్దవాళ్లద్వారా తెలియజేశాడు. సరోజ తన మ్రొక్కులన్నీ సార్థకమయ్యాయని భావించింది. పెళ్ళయిన తర్వాత ఒక్క భేదం బయటపడింది. ఆమెలో "ఎక్స్‌ప్రెషన్" లేదంటాడు ప్రకాశం. అతిథులు వచ్చినప్పుడు ఎలా వుండాలో తెలీదట. స్నేహితుల్నీ, కాలేజిలో అమ్మాయిలనీ ఆహ్వానిస్తాడు. వాళ్ళముందర, సరోజస్నేహితులెవరైనా వస్తే వాళ్ళముందర తన గేయాలు చదవటం తన కవిత్వాన్ని గురించి చర్చించటం అతనికి యిష్టం... సరోజ అటువంటి పార్టీలలో అసలు పాల్గొనదు; ఆ అమ్మాయిలందరూ ఇతని స్వోత్కర్షను గురించి వెనకాల నవ్వుకుంటారని కూడా సరోజ ఒకటి రెండు సార్లు చెప్పబోయింది..."అదంతా నీ జెలసీ; లేకపోతే సోషల్‌గా నీ చేతకానితనం అంతే! నీకు వాళ్ళు రావటం యిష్టంలేదు!" అంటాడు ప్రకాశం.

నేను అతిథిగా వెళివచ్చిన మరుసటిరోజు యిలాంటివాదనే వచ్చిందట. సరోజ యీసారి తీవ్రంగానే మందలిస్తూ "మర్యాద, ఇంగిత జ్ఞానం తెలిస్తే అలా సినిమాలో మమ్మల్ని వదిలిపెట్టి పరుగెత్తి వస్తారా?" అన్నది. "మర్యాద, ఇంగితజ్ఞానం నాకు నేర్పేదానికా వచ్చావా?" అని చెంపమీద కొట్టాడు ప్రకాశం. రేణుక కలుగజేసుకుని ప్రకాశంతో వాదించింది. ఫలితం అక్కా చెల్లెలిద్దరూ మరునాడు పుట్టింటికి ప్రయాణం కట్టారు. తర్వాత ఒక నెలకుగాని సరోజ తిరిగి రాలేదట!

నేను వచ్చినతర్వాత యింత రభస జరిగిందని కలలోకూడా వూహించలేదు నేను నాకిదంతా ఆశ్చర్యంగా తోచింది...ప్రకాశంలో పెళ్ళితర్వాత మార్పు వచ్చిందని తోచింది...ఏమంటే పార్టీలివ్వడం పూర్వం వాడికి బొత్తిగా అలవాటులేదు. నచ్చేదికాదు. ఆడవాళ్ల విషయంలో దూరంనుంచే 'నృత్యమయూరి'లా ఆరాధించటం చేతవును కాని దగరికి వెళ్ళి వాళ్ళ హృదయాల్ని జయించటానికి ప్రయత్నించే ధైర్యంమాత్రం వుండేది కాదు! ఎవరో అపురూప సుందరికోసమే ప్రత్యేకంగా నిరీక్షించే స్వప్నసుందరుడి పోజులో గంభీరంగా వుండేవాడు...పెళ్ళైన తర్వాత ఆడపిల్లల్ని యింటికి ఆహ్వానించి కవిత్వగానం చేస్తున్నాడంటే, అది, ప్రకాశంలో సరిక్రొత్త పరిణామమే అనుకొన్నాను.

## 3

కొన్ని మాసాలు గడిచాయి. రేణు పుట్టింటికి వెళ్ళింది. సరోజ తొలి కాన్పుకువచ్చి అక్కడే వుంది...మగపిల్లాడు...ప్రకాశం వచ్చి వెళ్ళాడట. ఆ సంగతి వ్రాస్తూ, ప్రకాశం తన ఉద్యోగం వదలుకొన్నాడనీ, ప్రస్తుతం వ్యవసాయం స్వయంగా చూస్తున్నాడనీ తెలిపింది రేణు. ప్రకాశానికి ముప్ఫై ఎకరాల పొలం వుంది, తను ఒక్కడే కొడుకు. వాళ్ళ నాన్నకు ప్రకాశం ఉద్యోగం చెయ్యటం మొదటినుంచీ యిష్టంలేదు. చివరకు తండ్రిమాట విన్నాడు కాబోలు అనుకున్నాను. ప్రకాశానికి ఉత్తరం వ్రాశాను. సుదీర్ఘమైన ప్రత్యుత్తరం వచ్చింది—

ప్రోత్సాహాన్ని వ్యక్తం చేస్తూ, వ్యవసాయం మీద తన కేర్పడిన ఆసక్తిని, అందులో ప్రవేశించిన తర్వాత అనుభవించిన ఆత్మతృప్తిని వర్ణించాడు. ఈసారి అటు వెళ్ళినప్పుడు తప్పకుండా వాళ్ళ ఊరు రమ్మన్నాడు.

తర్వాత రెండు నెలలకు నేను వెళ్ళటం తటస్థించింది. ప్రకాశం ఆహ్వానాన్ని మరచిపోలేదు. గ్రామీణపరిసరాల్లో ప్రకాశం పూర్తిగా మారిపోయి కనిపించాడు. గడ్డం పెంచాడు— చక్కగా తీర్చిన నల్లటి గడ్డం—దానితో చిరపరిచితమైన ముఖమే క్రొత్తగా తోచింది. నేనాశ్చర్యపడ్డాను. నవ్వించే చూపులు, ప్రశ్నించే కనుబొమలు, సుతారమైన చిరునవ్వులు, పెదవి వంకరలు, పూర్వపు తీవి ఏవీ లేవు వ్యక్తిలో. కాని ఇదివరకు లేని సౌమ్యత, నిలకడ ఒకరకమైన పరిపూర్తి వున్నట్టనిపించింది నాకు. హావభావాలలో తామసమైనం కూడా తెలుసుకుంటూ వింతగావుంది. ఎంతలో ఎంతమార్పు!

"ఏమిటి ప్రకాశం! పుత్రోదయం తోటే వైరాగ్యమా? ఈ పల్లెటూరులో కాపురం పెట్టేవ్... ఉన్నట్టుండి ఉద్యోగం వదులుకున్నావ్...నీలో చాలా మార్పు వచ్చిందే!" అన్నాను.

ప్రకాశం ఆగి, ఆత్మీయంగా రహస్యం చెప్తున్నట్లు "వైరాగ్యం కాదు ... ఆత్మజ్ఞానమోయ్" అన్నాడు. అదోవిధంగా నవ్వి, మళ్ళీ అంతలో గంభీరంగా వున్నాడు.

"ఏమిటో సంగతి?" అన్నాను.

"అది రహస్యం.......రేణుకతో చెప్పకుండా వుంటావంటే చెప్తాను... మరేం లేదు, సరోజకు తెలియటం యిష్టం లేదు, అందుకని..." అన్నాడు.

చాల నాళ్ళుగా ప్రకాశంపట్ల నేననుభవించిన సాన్నిహిత్యభావమేదో హృదయాన్ని ముంచెత్తి, అప్రయత్నంగా అతని చేతి వేళ్ళు తాకుతూ, 'బాగుందోయ్ యీ వుంగరం ఎప్పుడు కొన్నావ్?" అంటూనే "ఊఁ చెప్పు నీ రహస్యం!" అన్నాను.

"మనిషిలో 'నేను' అనేది బాహ్యప్రమాణాల మీద, లోకం మెప్పుమీద ఆధారపడినంత వరకు మనిషికి పునాది అంటూ వుండదు. గాలి మేడలాగ, తేలిపోయే మబ్బులాగ వుంటాడు. నిలకడ లేక, పైవాళ్ళ అభిప్రాయాల కోసం, పొగడ్తకోసం ప్రాకులాడుతుంది మనస్సు. దీనికి మూలకారణం ఒక రకమైన భయం... అంటే పైవాళ్ళ ఆదరణ లేకపోతే 'తను లేడ'న్న భావం... అందుకే బాహ్య ప్రమాణాలని సొంతం చేసుకోవటం... ఇలాంటి మనస్తత్వం గల వ్యక్తి నిజస్వరూప మేమిటో, తనకేం కావాలో, ఏది ఆత్మశ్లాఘో నిర్ణయం చేసుకోలేడు... ఎప్పుడూ అసంతృప్తి వెంటాడుతూ ఉంటుంది... దానివల్ల అనేక విధాలుగా ప్రవర్తించి యితరులకి బాధ కలిగిస్తాడు. స్వార్థంగా బాధపడతాడు... ఆ వ్యక్తికి ప్రేమించటం చేతకాదు... కాని లోకం తనమీద మోపే 'విలువల' భారాన్నుంచి తప్పుకోవటం ఏమంత సులభం కాదు... ఏదో ఒక సంఘటనవల్ల, ఒక షాక్‌తో అటువంటి విముక్తి కలగాలి... దాన్నే ఆత్మజ్ఞానం అంటాను. దానిమూలంగానే తృప్తిని సాధించటానికి వీలవుతుంది—ఇదే నా స్వానుభవం... మంచి 'పర్సనాలిటీ' వుందనీ, అందరూ నాచేత ఆకర్షింపబడతారనీ, ఒక బాహ్యప్రమాణంమీద నా జీవితం నడిచింది... క్షణ క్షణమూ అది నిరూపణ కావటంలోనే నాకు తృప్తి వుండేదని యిప్పుడు తెలుసున్నది... సరోజ, పెళ్ళయిన తర్వాత అందుకు సరిగా ప్రవర్తించలేదని అసంతృప్తి... నువ్వు నమ్మవుగాని, అప్పుడు నువ్వు మా యింటికి వచ్చివెళ్ళిన తర్వాత, ఆమెకు సోషల్ గా వుండటం తెలీదని గొడవచేసి కోపంలో కొట్టాను... కాని అటువంటి సమయాల్లో తప్ప, మళ్ళీ ఏకాంతంలో నన్ను వశపరచుకోగలశక్తి సరోజకు వుండేది; ఆమెను పెళ్ళాడటం నా అదృష్టమే, అంతటి సహనం ఎవరికీ వుండదు! తర్వాత సరోజ పుట్టింటికి వెళ్ళింది కాన్పుకోసం...నాలో అసంతృప్తి క్రొత్తరూపాన్ని దాల్చింది. నన్నెంతో ఆరాధిస్తున్నదనుకొన్న ఒక అమ్మాయిమీద ప్రేమప్రకటిస్తే, చెంపమీద కొట్టి, దూషించి వెళ్ళిపోయింది...ఆ సంఘటనతో, ఆ క్షణంలో 'నేను' నేనేనా? 'నాకు' యీ పరాభవం జరిగిందా?" అన్న ప్రశ్న గతాన్నంతా తలక్రిందులు చేసి, అంతవరకు నేననుకొన్నది, చేసింది అసత్యంగా, అనవసరంగా కనిపించింది...నా పరిసరాలకు నాకూ సంబంధం కనిపించలేదు; అక్కడి వాళ్ళమీద, కాలేజిమీద, ఆసక్తి పోయింది; వచ్చేశాను..ఇక్కడ నాకు తృప్తి, ఆనందం, కనిపించాయి."

ప్రకాశం చెప్పినదంతా పూర్తిగా అర్థం చేసుకోవటానికి, అన్వయించుకోవటానికి ప్రయత్నించాను. కొంతసేపటికి నిటూర్చాను:

"అయితే యిక నా అభిప్రాయాలతో నీకు పనిలేదన్న మాట!" అన్నాను.

"నీ 'అభిప్రాయాలతో' కాదుగాని 'నీతో' వుంది!" అంటూ ప్రకాశం నా భుజంమీద చెయ్యి వేశాడు.